# గమ్మత్తయిన మత్తు!

చోడిశెట్టి శ్రీనివాసరావు

"మీకోసం ఎవరో వచ్చారండీ!" ఉదయ్ ఆఫీసు నుండి ఇంటికి రాగానే చెప్పింది శిల్ప.


"ఎవరోయ్! ఎందుకొచ్చినట్టు?" అడిగాడు ఉదయ్.

"ఆ వివరాలు తెలుసుకునేటంతవరకూ అతను ఆగలేదు. మీరు లేరనగానే మళ్లీ వస్తానంటూ వెళ్లిపోయాడు." అంది శిల్ప.

"సర్లే, అవసరమైతే అతనే వస్తాడు!" అని, జేబులోంచి మల్లెపూల పొట్లం, దాంతోపాటు కొన్ని కరపత్రాలు తీసి, మల్లెపూలు శిల్పకిచ్చి, కరపత్రాలు టేబుల్ మీదపడేశాడు ఉదయ్.

"ఇవేమిటి?" అంది పొట్లం విప్పి మల్లెపూలు తలలో పెట్టుకుంటూ శిల్ప.

"ఇవా... ఇవి భారత పౌరుల్ని తీర్చిదిద్దే విద్యాలయాలు... అదేనోయ్, కాన్వెంట్ స్కూళ్లవారి కరపత్రాలు. గాంధీ సెంటర్లో ఆయా కాన్వెంటు తాలూకువాళ్లు పోటాపోటీగా వీటిని పంచిపెడుతున్నారు. 'వద్దు మహాప్రభో' అంటున్నా వినకుండా వెంటపడి వీటిని నా చేతిలో కుక్కారు. వాళ్ల కళ్లెదురుగా పారేస్తే బాగుండదని



నేను జేబులో కుక్కుకొచ్చాను. అదీ సంగతి!" అన్నాడు ఉదయ్.

"స్కూళ్లు తెరిచే రోజు దగ్గరయ్యేకొద్దీ వీళ్ల హడావుడి ఎక్కువైపోతోంది. ఉదయం మీరు ఆఫీసుకెళ్లాక ఓ కాన్వెంటువారు రిక్షాలో వచ్చి, తమ కాన్వెంట్‌లో పిల్లల్ని చదివించడం వల్ల కలిగే సత్ఫలితాలను వివరిస్తూంటే, వాళ్లు వీధి మలుపు తిరక్కుండానే మరొకళ్లు ఆటోలో వచ్చి అదే పాట మొదలుపెట్టారు!" అంది శిల్ప.

"కారులో ఇంకా ఎవరూ రాలేదన్నమాట!" అంటూ నవ్వి, "పిల్లలేరీ?" అన్నాడు ఉదయ్.

"సెలవుల్లో ఎక్కడికీ తీసుకెళ్లలేదని గొడవ చేస్తూంటే మీ నాన్నగారితో సినిమాకు పంపించాను!" అంది శిల్ప.

"టీవీలో చూసే సినిమాలు సరిపోవడంలేనట్టుంది... క్లాసు పుస్తకాలో, ఎక్కాలో చదవండిరా సన్నాసుల్లారా అని చెప్పి నేను ఆఫీసుకి తగలడ్డం, వచ్చేసరికి వీళ్లు నా కంటికి కనిపించకుండా పోవడం; వేసవి సెలవులన్నీ ఇలాగే గడిపేశారు వెధవలు! ఏమైనా నీ గారాబం ఎక్కువైపోతోందిలే వాళ్లకి!" అన్నాడు ఓరకంట శిల్పని చూస్తూ ఉదయ్.

శిల్ప చిన్నగా మందహాసం చేసి, ఫ్లాస్కుల్లో ఉన్న టీ కప్పులో పోసి ఉదయ్‌కిచ్చి, "నేను వంట కార్యక్రమంలోకి దిగుతున్నాను!" అంటూ వంట గదిలోకి నడిచింది.

టీ తాగి, హాల్లో అటూ ఇటూ కాసేపు పచార్లు చేసి టీవీ ఆన్ చేశాడు ఉదయ్.

మరుక్షణం సిటీ కేబుల్‌లో ప్రత్యక్షమైందో ప్రకటన!

'ఏ.ఆర్. కాన్వెంట్ హై స్కూల్... ప్రభుత్వంవారిచే గుర్తింపు పొందినది... ఎల్‌కెజి నుండి టెన్త్ వరకు... తెలుగు మరియు ఇంగ్లీషు మీడియం... మీ పిల్లలకు స్వచ్ఛమైన తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలు రావాలంటే, మీ చిన్నారులు ఎల్‌కెజిలోనే రైమ్స్ పాడి మిమ్మల్ని ఆనంద డోలికల్లో తేల్చాలంటే తప్పక మా కాన్వెంట్‌లో చేర్పండి. మూడో తరగతి నుండీ...'

'వీడు మరీ తినేస్తున్నాడురా, బాబూ!' అని విసుక్కుంటూ ఉదయ్ కుర్చీలోంచి లేచి ఆ ప్రకటన పూర్తి కాకుండానే టీవీ నోరు నొక్కేశాడు. స్నానం కానిచ్చి, టేబులు మీదున్న ఓ కథల పత్రిక తీసుకుని మేడెక్కాడు. ప్రశాంతంగా కూర్చుని దాంట్లో కథలు చదవసాగాడు..

ఓ అరగంట గడిచింది. వీధిదీపాలు వెలిగాయి.


"నేను ఇందాక చెప్పిన వ్యక్తి వచ్చాడండీ!" అంది నిశ్శబ్దంగా మేడమీదికొచ్చి శిల్ప.

మేడమీది నుంచే తొంగి చూశాడు ఉదయ్.

## ఒకానొక అసురసంహారం

నరకుణ్ణి నరికేద్దామనుకున్నా
కటికచీకటి కమ్ముకుంది!
అరే... వీడు
ఆరుగురు దొంగల్లా
మనసుని మసి చేశాడు!
మతాల నుంచీ
నైతికత్వాన్ని విడదీశాడు
నిజాయితీ లేని నినాదాలు!
ఆచరించని నీతులు!
సూత్రీకరణ ముసుగులో
అసామాజీకరించే
మార్పులేని మారనితనం... వీడు!
మోసాన్నీ, వంచననీ
ఆధునికం చేసి
అనాగరకతని
కొత్తగా చెబుతున్నాడు
వికృతత్వాన్ని మింగిన అందగాడు!
ఎక్కడున్నాడని వెదకనూ?
కోట్ల దివ్వెలు
దీపావళిని
వెలిగించలేకపోతున్నాయి
అయినా
చిరుదివ్వెను వెలిగించి
నరకుణ్ణి నరికే యత్నం
మానను!

వరాహగిరి
వేంకటసుబ్బారావు



గేటువద్ద ఓ అపరిచిత వ్యక్తి నిలబడి ఉన్నాడు. ఖద్దరు బట్టలు వేసుకున్నాడు. చామనచాయ రంగు, గిరజాల జుట్టు, గుబురు మీసాలు... గడ్డం కొద్దిగా పెరిగి ఉంది. వయస్సు అయిదు పదుల వరకూ ఉండొచ్చు. అతని నోట్లో పొడవాటి చుట్టొకటి వెలుగుతోంది.

'ఈ చుట్ట కాల్చే చుట్టం ఎవరా?' అనుకుంటూ కిందికి దిగాడు ఉదయ్.

అతను నోట్లో వెలుగుతున్న చుట్ట అవతల పారేసి, ఉదయ్‌కో నమస్కారం పెట్టి, "అయ్యా! నేను ... తమ బంధువులు ... సింగినాధపురం సర్పంచ్ సన్యాసిరావుగారు పంపగా వచ్చానండీ! నన్నంతా గసాగ అంటరు!" అన్నాడు ఉదయ్‌ని చూస్తూనే.

"గ...సా...గ..." ఏదో అనుమానంతో ఉదయ్ భ్రుకుటి ముడిపడింది.

అతడది గ్రహించినట్టు చిన్నగా నవ్వి, "మీరు కంగారుపడకండి... నా పూర్తి పేరు గరిడి సాము గంగన్న. మా ఊళ్లో వాళ్లు నన్ను గసాగగా మార్చేశారు. అంతకన్నా మరేం లేదు!" అన్నాడు.

"ఓహో, అలాగా... రండి... రండి!" సాదరంగా అతణ్ణి ఆహ్వానించాడు ఉదయ్.

గసాగ అంతవరకూ పక్కనే ఉంచిన చిన్న గోనెసంచీ మూటపట్టుకుని లోపలికొచ్చి, "ఇవి కొత్తపల్లి కొబ్బరి మామిడిపళ్లండీ... తమకోసం!" అన్నాడు నసుగుతూ.

"కొత్తపల్లి కొబ్బరా! ఇప్పుడు ఇవెందుకండీ తెచ్చారు?"

"ఇవంటే మీ కెంతో ఇష్టమని మా సర్పంచ్‌గారు మరీ మరీ చెప్పారండీ!"

"మరే... మరే! ఆ ఊరు వదిలిపెట్టి పదిహేనేళ్లయినా నా ఇష్టాయిష్టాలేమిటో ఆయన మరిచిపోలేదన్నమాట! పళ్ల మార్కెట్‌లో రోజూ గాలిస్తున్నా ఈ కొత్తపల్లి కొబ్బరి దొరికిచావడంలేదు!" అన్నాడు ఉదయ్.

"ఎలా దొరుకుతాయండీ... దొరకవు! వీటి రుచి అలాంటిది మరి! నిజంగా ఆ సృష్టికర్త బ్రహ్మగారు గనుక భూలోకం వచ్చి కొత్తపల్లి కొబ్బరి రుచి చూశారంటే, ఈ మామిడిపళ్ల సీజను అయిపోయేవరకూ పై లోకం వెళ్లమన్నా వెళ్లరండి! అమ్మమ్మ... కొత్తపల్లి కొబ్బరంటే మామిడిపళ్లకే కింగ్ కదటండీ!" గర్వంగా అన్నాడు గసాగ.

ఉదయ్ పకపకా నవ్వి, "మీరు భలే మాట్లాడుతున్నారే, ఏం చదివారండీ?" అన్నాడు.

"అప్పట్లో అయిదో తరగతి వెలగబెట్టానండి... తెలుగులో మాత్రమే రాయడం, చదవడం వచ్చు!" చెప్పాడు గసాగ.

"సరి సరి! మనం ఇందాకట్నుంచీ నిలబడే మాట్లాడుకుంటున్నాం. రండి, మేడమీద కూర్చుందాం!" అంటూ మామిడి పళ్ల బుట్ట లోపల పెట్టి గసాగతో మేడమీద కెళ్లాడు ఉదయ్.


కుర్చీలో కూర్చుని చల్లగాలి ఆస్వాదిస్తున్న శిల్ప వాళ్లను చూస్తూనే పైకి లేచి 'ఎవరీ వ్యక్తి?' అని కళ్లతోనే భర్త నడిగింది.

"ఈయనది సింగినాధపురం, శిల్పా! పేరు గసాగ. కాస్త కాఫీనో... టీనో...!"

"అయ్యా, ఉదయ్‌గారూ! నాకూ, వాటికీ ఆమడ దూరం! ఉంటే కాస్త మజ్జిగ... లేకుంటే మంచినీళ్లు చాలు!"

"మంచినీళ్లేమిటండీ... మజ్జిగే ఇస్తాను!" అని హుషారుగా కిందికి దిగింది శిల్ప.

గసాగని కుర్చీలో కూర్చోమని "ఇంతవరకూ తమరొచ్చిన కారణం చెప్పలేదు!" అన్నాడు తనో




కుర్చీలో కూర్చుంటూ ఉదయ్.

"నేనూ మనవి చేద్దామనుకుంటూన్నా. ఇంతలో మీరే అడిగారు. ఇదిగోనండీ... ఈ ఉత్తరం సర్పంచ్‌గారు తమకివ్వమన్నారు!" గసాగ జేబులోంచి ఉత్తరం తీసి ఉదయ్‌కిచ్చాడు.

ఆ ఉత్తరం మడతలు విప్పాడు ఉదయ్.

"ఒరే ఉదయం! ఈ ఉత్తరం తెచ్చిన గరిడిసాము గంగన్న మనకు చాలా చాలా కావాల్సినవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే నా కుడిభుజంలాంటివాడు. ఇతనికి నీతో పనిబడింది. వివరాలు అతనే స్వయంగా చెబుతాడు. అదేమిటో విని, తప్పక ఇతడి పని నెరవేర్చగలవు!

"సన్యాసిరావు, సర్పంచ్, సింగినాథపురం."

"అసలు విషయం ఇప్పుడర్థమైంది గసాగ గారూ! తమ పనేమిటో చెబుతారా?" ఉత్తరం చదవగానే అడిగాడు ఉదయ్.

"మరేం లేదండీ... మీరు కాస్త సిఫారసు చేసి నా మనవడికి నాలుగో తరగతిలో సీటిప్పించాలి!"

"నాలుగో తరగతిలో సీటా?" ఆశ్చర్యపోయాడు ఉదయ్. సింగినాథపురంలో అయిదో తరగతివరకూ ఆ పక్కనే ఉన్న కొత్తపల్లిలో పదో తరగతివరకూ ప్రభుత్వ పాఠశాలలున్నాయన్న సంగతి అతడికి బాగా గుర్తు. అవి కాదని ఇక్కడ సీటేమిటి? ఆ మాటే గసాగతో అన్నాడు.

"చాల్లెండి, ఆ దుంపలబడిలో చదువొస్తే మీ దాకా రావడమెందుకు?"

"దుంపల బడా?!" తెల్లబోయాడు ఉదయ్.

గసాగ విరగబడి నవ్వి, "అదేలెండి... మా ఇస్కూలు కాడికో అరవై ఏళ్ల ముసలావిడ చిలకడ దుంపలు ఉడకబెట్టి తెచ్చి అమ్ముతుంటుంది. అందుకని దాన్ని మేమంతా దుంపలబడని అంటూంటాం!" అన్నాడు.

"బావుందండీ...! ఇంతకీ ఇక్కడ మీ కే స్కూల్లో సీటు కావాలంటారు?"

"హరినగర్‌లో ఎ.ఆర్. కాన్వెంట్ హైస్కూలుంది కదండీ... దాంట్లో!"

చిన్నగా ఉలిక్కిపడి... "ఏ.ఆర్. కాన్వెంట్‌లోనా?" అన్నాడు ఉదయ్.

"అదేమిటీ, ఆ పేరు వింటూనే మీరు ఉలిక్కిపడ్డారు! ఆ కాన్వెంట్ ప్రిన్సిపాల్‌గారు మీకు ఆప్తమిత్రులనీ, మీ పిల్లలు ముగ్గురూ దాంట్లోనే చదువుతున్నారనీ ఆ మధ్య సర్పంచ్‌గారు ఇక్కడికొచ్చినప్పుడు మీరే చెప్పారటగా!"

"ఆ మాట నిజమే గానీ, మాకు ఇద్దరే పిల్లలండీ. మా అన్నయ్యగారు పోయిన సంవత్సరం నేను వద్దంటున్నా వినక, ఆరువేలు డొనేషన్ కట్టి వాళ్లబ్బాయిని ఆ కాన్వెంట్‌లో అయిదో తరగతిలో చేర్చారు...."

"ఆ చదువుల తల్లి సరస్వతీ దేవి ఎప్పుడో వ్యాపారవస్తువైపోయిందిలెండి... డొనేషను కట్టకుండా సీటిప్పించమని నే ననడంలేదు. డబ్బెంతయినా మీరు ఆలోచించనక్కరలేదు. దాంట్లో మా వాడికి సీటు కావాలంతే!" పట్టుదలగా అన్నాడు గసాగ.

"డొనేషనొక్కటే కాదు, వాళ్లు ఎంట్రెన్స్ టెస్ట్ కూడా పెడతారు గసాగ గారూ!" అన్నాడు ఉదయ్.

"ఆ టెస్టేదో పెట్టడం, దాంట్లో మావాడు డింకీ కొట్టడం అయిందండీ! అందుకే కదా మీ దగ్గరికొస్త...!" అన్నాడు అసలు సంగతి చెప్పేస్తూ గసాగ.

"మరింకెందుకండీ లేనిపోని ప్రయాస? నా మాట విని అయిదో తరగతి వరకూ మీవాణ్ణి ఆ దుంపలబడిలోనే వదిలెయ్యండి గసాగగారూ! తర్వాత చూద్దాం!"

"అయిదో తరగతి వరకూ మా వాడందులో ఉంటే వచ్చిన అ ఆలు కూడా మరిచిపోతాడండీ!"

"అంటే, ప్రభుత్వ పాఠశాలల్లో చదువసలు చెప్పనే చెప్పరనీ, కాన్వెంట్ స్కూళ్లల్లోనే చదువు చెబుతారనీ మీ ఉద్దేశం కాబోలు! ఆ మాటకొస్తే ఎ.ఆర్. కాన్వెంట్‌లో చదువు చెప్పే తీరు ఏమాత్రం బావుండలేదు గసాగ గారూ! వెళ్లి అడుగుతుంటే ఎప్పటికప్పుడు వాడేదో కుంటిసాకులు చెప్పి, ఓ కూల్‌డ్రింక్ నాచేత తాగించి పంపేస్తున్నాడు. మిత్రుడన్న మొహమాటంతోను, ఈ రోజు కాకపోతే రేపైనా స్టడీ బాగుంటుందేమోనన్న అభిప్రాయంతోనూ ఇప్పటివరకూ మా వాళ్లని దాంట్లో ఉంచాను గానీ, ఇక ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలోకి మార్చేస్తున్నాను!" అన్నాడు ఉదయ్.

"ఏంటో మీరలా అంటారు... ఆ కాన్వెంట్‌లో మూడో తరగతి నుండీ కంప్యూటర్ శిక్షణ ఇస్తామనీ, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలు నేర్పిస్తామనీ, కరాటే, డాన్సు క్లాసులు నిర్వహిస్తామనీ టీవీలో పదే పదే ప్రకటన చేస్తున్నారు కదండీ!"

"ప్రకటన విషయం పక్కన పెట్టండి... నేను అనుభవ పూర్వకంగా చెబుతున్నాను కదా, మీ రెందుకని నమ్మరు?"

"అపార్థం చేసుకోకండి, ఉదయ్‌గారూ! మా ఊళ్లో రిక్షా తొక్కే రామన్న, డప్పు కొట్టే లచ్చన్నా తమ పిల్లల్ని ఇక్కడే ఉంచి ఆ కాన్వెంట్‌లో చదివిస్తున్నారు. అలాంటప్పుడు అయిదెకరాల పంటభూమి ఉన్న నేనేనా నా మనవణ్ణి ఆ కాన్వెంట్‌లో చదివించలేనంత చవటనీ, చేతగానీ వాణ్ణినూ!" కాస్త ఆవేశంగా అన్నాడు గసాగ.

అతని బాధేమిటో తెలిసిన ఉదయ్ వస్తున్న నవ్వు ఆపుకుని, "ఏది ఏమైనా మీవాడికి ఎ.ఆర్. కాన్వెంట్‌లోనే సీటిప్పించాలంటారు, అంతేనా?" అన్నాడు.

"అవునండీ, వాణ్ణి అందులో పడేశారంటే ఆజన్మాంతం మీకు రుణపడి ఉంటాను!" ప్రాధేయపూర్వకంగా అన్నాడు గసాగ.

"అంత మాటెందుకులెండి... ఆ కాన్వెంట్‌లో సీటు కోసం మీరేం వర్రీ కానవసరం లేదు. కూర్చోండి, ఇప్పుడే వస్తాను!" అని మేడ దిగాడు ఉదయ్.

వంటింట్లో మజ్జిగ కలుపుతోంది శిల్ప.

"కాసిన్ని మజ్జిగ తేవడానికి ఇంతసేపా?" అడిగాడామెను ఉదయ్.

"మన పాలు సరిగ్గా తోడుకోలేదండీ... పక్కింటబ్బాయిని పాన్‌షాప్ వద్దకు పంపి పెరుగు పాకెట్ తెప్పించాను!" అంది శిల్ప.

"సర్లే, తొందరగా తీసుకెళ్లి ఇవ్వు!" అని శిల్పకు చెప్పి, గదిలోకి నడిచాడు ఉదయ్. కాసేపు వెతికి, ముగ్గురు పిల్లలవీ మూడు నోట్ బుక్స్ పట్టుకుని తిరిగి మేడమీదకొచ్చాడు.

అప్పుడే మజ్జిగ తాగి, తనెందుకొచ్చిందీ శిల్పకు వివరిస్తున్నాడు గసాగ.

"చూడండి, గసాగ గారూ! ఈ నోట్‌బుక్స్ ఎ.ఆర్. కాన్వెంట్‌వారివేనని పై అట్ట చూడగానే తెలుస్తోందిగా!" అన్నాడు ఉదయ్.

"అందుకింకా సందేహమాండీ!" క్షణకాలం ఆ పుస్తకాలకేసి చూసి అన్నాడు గసాగ.

"ఇదిగోనండీ, ఇది మొన్న అయిదో తరగతి పరీక్ష రాసిన మా అన్నయ్యగారబ్బాయి తెలుగు క్లాస్‌వర్కు పుస్తకం. దీంట్లో నేను ఎర్ర సిరాతో చుక్కలు పెట్టిన ఈ ప్రశ్న జవాబు ఓ మారు చదవండి!" అంటూ ఆ పుస్తకం గసాగ చేతికి ఇచ్చాడు ఉదయ్.

గసాగ జేబులో ఉన్న కళ్లజోడు తీసి పెట్టుకుని ఉదయ్ చెప్పింది చదివాడు...

'జాఘువ రాసిన గండాలేవి? పరదాసి, గబ్బము, బావూజీ'...

"ఉదయ్‌గారూ! ఏమిటిది? ఈ జవాబు దిగువనే రైటు పెట్టి టీచరు సంతకం కూడా చేసినట్టున్నారే... అసలీ జాఘువ ఎవరు?" అయోమయంగా ఉదయ్‌ని చూస్తూ అన్నాడు గసాగ.

"జాఘువ ఎవరో నాకూ తెలియదు. అవన్నీ తర్వాత చర్చించుకుందాంలెండి... ఇదిగో, ఇది మూడో తరగతి చదువుతున్న మా అబ్బాయి క్లాసు వర్కు పుస్తకం. దీంట్లో నేను ఎర్రసిరాతో చుక్కలు పెట్టిన ఈ మాట చదవండి!"

ఓ మారు అది చూసి చదివాడు గసాగ 'సరస్సు = తల' రైట్ పెట్టడంతోపాటు ఆ పేజీ చివర్లో టీచరు సంతకం ఉంది. "సరస్సు అన్నా కూడా తలకాయే నన్నమాటండీ?" తల గోక్కుంటూ అన్నాడు గసాగ.

ఉదయ్ మందహాసం చేసి, "ఇదేమో మొదటి తరగతిలో ఉన్న మా అమ్మాయి తెలుగు నోట్స్. ఇందులో అఆలతో మొదలుపెట్టి కొన్ని అక్షరాలు రాయించారు. దీంట్లో 'అం' తర్వాత ఉన్న అక్షరాన్ని మీరు ఉచ్చరించాలి!" అన్నాడు.

గసాగ ఆ పుస్తకం చేతిలోకి తీసుకుని "అ...ఆ...ఇ...ఈ..." అని గబగబా చదువుతూ అం వద్దకొచ్చి షాక్ కొట్టినట్టు ఆగిపోయాడు.

"ఆగిపోయారేమిటీ? నేను చదవమన్నది దాని పక్క అక్షరమే! ఎర్ర సిరాతో చుక్కలు పెట్టానుగా... అది!" అన్నాడు ఉదయ్.

"అదేనండీ... అసలీ అక్షరం ఎలా పలకాలా అని..."

"ఏమో... ఎలా పలుకుతారో నాకు తెలీదు. అక్కడే రైటు పెట్టి, దిగువున టీచర్ సంతకం చేశారు. కానివ్వండి మరి!"

"ఏం కానివ్వండి నా బొంద! చిన్నతనంలో నేను అఆలు నేర్చుకునేటప్పుడు మా మాస్టారు అ రాసి పక్కన ఒక సున్న పెడితే అం అనీ, మరొక అరాసి దానిపక్కన రెండు సున్నలు పెడితే అః అని చెప్పడం నాకు బాగా గుర్తు. ఇక్కడ మీ అమ్మాయేమో ఆ పక్కన రెండు సున్నాలు పెట్టింది. ఆ పక్కన రెండు సున్నాలు పెడితే... రెండు సున్నాలు పెడితే ఆహా... ఆహా... ఉదయ్‌గారూ! వస్తానండీ!"

"అదేమిటీ, అప్పుడే వెళ్లిపోతారా! కూర్చోండి... మచ్చుకి మాత్రమే నేను మీ కివి చూపించాను. మొత్తం..."

"మీరు మచ్చుకు చూపించినవి చదవగానే నా మతి సగం పోయింది. ఇక మొత్తం నోట్సులు తిరగేసి, ఉన్న మతికూడా పోగొట్టుకోమంటారా? మీకు ధర్మం కాదు, ఉదయ్‌గారూ! నేను వెళ్తానండీ!"

"ఏమిటండీ, వెళతానూ... వెళతానూ అంటారూ! మీవాడికి ఎ.ఆర్. కాన్వెంట్‌లో సీటొద్దా?"

"చాల్లెండి... దాంట్లో చదువెంత రైటుగా చెబుతున్నారో ఆ స్కూలు టీచర్ల సంతకాల సాక్షిగా మీరు రుజువు చేశాక కూడా ఇంకా సీటు కావాలంటానా? వద్దు, ఉదయ్‌గారూ, వద్దు! టీవీలో ప్రకటన చూసీ, మా రిక్షా రమాన్న, డప్పు లచ్చన్న చెప్పుకునే గొప్పలు వినీ ఆ స్కూల్లో చదువెంతో చక్కగా చెబుతున్నారని అనుకున్నాను గానీ, దీనికన్నా మా దుంపలబడే బెటరని తేలిపోయింది. విద్యార్థులు రాసింది తప్పో ఒప్పో చూడకుండా సంతకాలు పెట్టేయడమే చదువు చెప్పడం అనుకునే ఏ.ఆర్. కాన్వెంట్ స్కూలువారికి కొన్ని వేల నమస్కారాలు. నేనిప్పుడు సింగినాధపురం పోయే బస్సులో పడి పోవడం చాలా ముఖ్యం... ఉంటాను, శిల్పమ్మా! సెలవు, ఉదయ్‌గారూ!" అంటూ వాళ్ల సమాధానానికెదురు చూడకుండా గబగబా మేడ దిగి రోడ్డెక్కేశాడు గసాగ.

"హమ్మయ్య... మొత్తానికి గసాగకి పట్టిన గమ్మత్తయిన మత్తు వదిలిపోయిందీ!" అన్నాడు పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్లిపోతున్న గసాగని చూస్తూ ఉదయ్.

"గమ్మత్తయిన మత్తా?" అంది శిల్ప ఆశ్చర్యంగా.

"అవును, శిల్పా! పక్కవాళ్లని చూసి మనం, మనల్ని చూసి ఇంకొకళ్లూ అనుకరించడం అన్నది నిజంగా ఓ గమ్మత్తయిన మత్తు. ఈ మత్తులో పడి మనం ఆలోచించడం మరిచిపోయి ఎక్కడికో.... ఎక్కడికో కొట్టుకుపోతున్నాం!" అన్నాడు భారంగా నిట్టూరుస్తూ ఉదయ్. ■

